ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక
1997 దీపావళి ప్రత్యేక సంచిక

మరాఠీ మూలం: యోగిరాజ్ వాగ్మారే

ఆంగ్లానువాదం: లలితా పరాంజపే

తెలుగుసేత: పసుపులేటి గీత




మరాఠీ దళిత కథ

రోడ్డు పక్కన జడలు విప్పకున్న చింత చెట్టుకింద బండ మీద కూర్చున్నాడు షేకూ. మిట్ట మధ్యాహ్నం చింతరెమ్మల్లోంచి ఎండ సూదుల్ని గుచ్చుతోంది. కూర్చున్నాడన్న మాటే గానీ ఒక్క క్షణం కూడా నిలువలేనట్టు లేచి వెళ్ళి, రెండు మూడడుగులు ముందుకు నడిచి కళ్ళ మీద చేతిని అడ్డుపెట్టుకుని, రోడ్డు చివరంటా కళ్ళు చికిలించి, మెడసారించి చూడ్డం... తల అడ్డంగా ఆడిస్తూ, ఏదో గొణుగుతూ వచ్చి బండ మీద కూర్చోవడం... షేకూ గంటనుంచీ ఇదే పని చేస్తున్నాడు. ముఖంలోని ముడతల్లో అలసట చెమటగా కారుతోంది. మనసులో ఏ మాత్రం స్థిమితం లేదు. అడవి నుంచి కట్టెలు కొట్టుకుని మోపులు నెత్తిన పెట్టుకుని గుడానికి వచ్చేవాళ్ళని ఆపి "దార్లో యాడైనా మా గుంటోడు కనిపిచ్చినాడా?" అంటూ అడగడం ప్రారంభించాడు. కొందరు అతను అడుగుతున్నదేవిటో అర్థం కానట్టు చూసి, తల మీద మోపును సర్దుకుని పరుగులాంటి నడకతో వెళ్ళిపోయారు. నెత్తిమీద బరువు వల్ల వాళ్ళ నడక నాట్యంలా లయబద్ధంగా వుంది. షేకూ మాత్రం దారంట ఎవరొచ్చినా ఆపకుండా అడుగుతూనే వున్నాడు. ఎవరోకతను మాత్రం "నేనొస్తాంటే దార్లో రెండు మూడు మందలు కనిపిచ్చినాయ్. దాంట్లో మీ సంటోడు ఏతావనుండాడో నాకెట్టా తెలుస్తాది" అన్నాడు. అతనేం మాట్లాడుతున్నాడో షేకూకి అర్థం కాలేదు. 'ఏందబయా? గుంటోడంటే ఎవురనుకున్నా... నా కొడుగ్గదా!' తెల్లసొక్కా యేసుకోనుంటాడు.. "షేకూ చెబుతూనే వున్నాడు. ఆ వ్యక్తి ఏం విననట్టు తన దారిన తాను వెళ్ళిపోయాడు. షేకూకు బాగా అసహనంగా వుంది. ఇక లాభం లేదు. పల్లె పొలిమేరల్లోకి వెళ్ళి చూడాల్సిందేనని అనుకున్నాడు. బండదగ్గర వదిలిన చెప్పులు వేసుకుని రోడ్డు మీదికి వచ్చాడు.

'సందేళకి కొంపకొచ్చి పడురా నాకొడకాని చెప్పినా, ఏం లాభం, ఎదవ ఆడనే తగలక పొయ్యుంటాడు'. షేకూ గొణుక్కుంటూ నడుస్తున్నాడు. అతనలా నడుస్తూ వుండగానే నామా బంగారు తన పశువుల్ని తోలుకుని ఇంటికి తిరిగొస్తూ కనిపించాడు. షేకూని చూడగానే "'ఏం ముసిలోడా, ఈయాళవ్వడు ఏడకి ఎలబార

తండావ్?" అని అడిగాడు. "అయ్యా, తవరా, యాడికినేడు బాబయ్యా, నా కొడుకుని ఎతుక్కుంటా వస్తాండా, వోడింకా ఇంటికి రాలే. .." తలకి చుట్టుకున్న రుండు గుడ్డని గబగబా పీకి నడుంకి కట్టుకుని చేతులు కట్టుకుని నత్తగుల్లలా ముడుచుకపోయాడు షేకూ అతణ్ణి చూసి, నామా బంగారు జేబులోంచి వుగాకును తీసి దవడలో పెట్టుకుని నమలడం ప్రారంభించాడు. అలా నములుతూనే ఏదో పనున్న వాడిలా కాసేపు అక్కడే ఆగి రెండు మూడు సార్లు నేల మీద ఉమ్మాడు. అతని పశువుల మంద అప్పటికే అతన్ని కన్నా ముందు ఇంటి దారి పట్టింది. కాసేపాగి అతను వెళ్ళిపోయాడు. ఏం చేయడానికి తోచనివాడల్లే షేకూ పక్కకు ఒదిగి నిలబడి, అప్పడప్పడు మోరసాచి ఆ ఒంటరిదారి కేసి ప్రశ్నార్థకంగా చూస్తున్నాడు. పల్లె పొలిమేరల్లో చీకటి కండెనలా చిక్కబడుతోంది. షేకూకి ఏమీ కనిపించడం లేదు. షేకూ ఇంటికి తిరిగొచ్చాడు. వాకిట్లో పొయ్యి మీద నూకలు కుతకుతలాడుతున్న చప్పడు, పొయ్యిలో చిటపటలాడుతున్న ఎండువుల్లల చప్పడు, బండ మీద మిరపకాయ పచ్చడి నూరుతున్న శబ్దం... మునిమాపు ముసురుకున్నా గుడిసెలో దీపం పెట్టలేదు. వంట పనిలో ఆడవాళ్ళు మునిగిపోయి వున్నారు. షేకూ గుడిసెలోకి వెళ్ళి లాంతరు తీసుకొచ్చి మట్టి తిన్నె మీద కూర్చున్నాడు. అతని మనసంతా ఎంతకీ రాని కొడుకు కోసమే ఎదురు చూస్తోంది. లాంతర్ని తుడిచి, కిరసనాయిల్ పోసి దీపం వెలిగించాడు షేకూ. దీపం వెలుతురు కూడా మసగ్గా కనిపిస్తోంది. వత్తిని పెంచి దూలానికి కట్టిన ఇనప కమ్మీకి లాంతరును తగిలించాడతను. వాకిట్లోకి వచ్చి చూశాడు. ఎదురుగా ఇంటికొస్తున్న కొడుకు దూరాన కనిపించాడు. అంత చీకట్లోను ఆ ముసలివాడి ముఖంలో ఒక వెలుగు తృటి మాత్రం మెరిసి మాయమైంది. "ఏందిరా, షేతిబా ఇంతసేపూ ఏడున్నా?"

"పొద్దబొయ్‌నాక ఎలబారినాలేయ్యా' గోడకి సంచీ తగిలిస్తూ జవాబు చెప్పాడు షేతిబా. "ఒంటిగా వొచ్చినావా, ఎవరూ తోడురాలే.." షేకూ కొడుకును పరిశీలనగా చూస్తూ అడిగాడు. "ఆ...

ఆత్మారామ్ షెల్కే అని ఒకడొచ్చి నాడ్లే. వాళ్ళూరు వాడ్‌గావ్. ఇంతసేపు వాడింట్లోనే వున్నా. దానికే ఇంతపొద్దు బొయ్‌ది".

"సరేలే, పొయ్ ముకం కడుక్కుని రాబో" షేతిబా ముఖం కడుక్కోవడానికి ఇంటి వెనక్కి వెళ్ళిపోయాడు. ఈలోగా షేతిబా తల్లి వాడి కోసం కొంచెం 'బక్రీ' (ఎండు రొట్టె) కాల్చుకొచ్చింది. బక్రీని చూడగానే ఇంట్లో పిల్లలందరూ ఆమె చుట్టూ మూగారు. షేతిబా ముఖం కడుక్కుని వచ్చాక, వాడి తల్లి వాడికి తిండి పెట్టింది. పిల్లలు వెంటనే వాడి దగ్గరకు పరిగెత్తు కొచ్చారు. షేతిబా మౌనంగా తింటున్నాడు. నివురు కింద నిప్పలాంటి ఈ నిశ్శబ్దాన్ని షేకూ భరించలేకుండా వున్నాడు. షేతిబా ముందు 'తాలీ' (పళ్లెం) అతను చెయ్యి పెట్టినప్పడల్లా గణగణమంటూ చప్పడు చేస్తోంది. ఎవ్వరూ ఏమీ మాట్లాడడం లేదు. వుండుండి పిల్లలు పెట్టే కేకలు తప్ప మరే శబ్దమూ లేదు. దోఖీ దగ్గర ఫ్యాక్టరీకి వెళ్ళిన షేతిబా ఏం కబురు పట్టుకొచ్చాడు. ఎంత ఆలోచించినా షేకూ అదేమై వుంటుందో వూహించలేక పోతున్నాడు. షేతిబా మాట్లాడితే బావుణ్ను. షేకూ మాత్రమే కాదు అతని భార్య కూడా కొడుకు నోట్లోంచి రాలబోయే ముత్యాల కోసం కళ్ళలోకి ప్రాణాలు తెచ్చుకొని ఎదురు చూస్తున్నారు. షేతిబా పెళ్ళాం పామి పరిస్థితి కూడా ఇంచుమించు అలానే వుంది. మొగుడి మౌనం దాన్ని బాగా ఇబ్బంది పెడుతోంది. షేకూ ఇంకెంత మాత్రమూ ఆగలేక పోయాడు. ఎలాగోలా గొంతు పెకలించుకుని "పనేవన్నా అయ్యిందంట్రా?" అని అడిగాడు. గుడిసెలో చీకటి చిక్కబడింది. లాంతరులో చింతపిక్కంత దీపం పంజరంలో పిట్టలా కొట్టుకుంటోంది. పెద్దవాళ్ళ ముఖాల్లో గాంభీర్యం పిల్లల నోళ్ళు మూయించింది. నిశ్శబ్దం మరింత గట్టి పడింది. పామీ, షేతిబాతల్లి చెవులు తప్ప శరీరంలో ఇంకే భాగమూ పని చేయనట్టు షేతిబా మాట కోసం ఎదురు చూస్తున్నారు. 'లేదు' షేతిబా మాటతో నిశ్శబ్దమే కాదు గుడిసె గుండె కూడా గాయపడింది. 'బక్రీ' షేతిబా నోట్లో పట పటలాడుతోంది. ఆ మాటన్న తరువాత గొంతు పట్టేసిన వాడిలాగా షేతిబా మంచినీళ్ళు గటగట తాగాడు. షేతిబా సమాధానం విన్న అతని తల్లి అప్రయత్నంగానే నిట్టూర్చింది. పామీ చెక్కిట జారిన కన్నీటి చుక్కల్ని కంగారుగా మేలిముసుగుతో తుడుచుకుంది. మొదట తేరుకున్నది షేకూవే. "సాహేబు ఏం చెప్పినాడు?"

"ఖాళీలు లేవన్నాడు. వొచ్చేనెల ఏమన్నా వుంటే సూస్తాడంట" తల వంచుకుని షేతిబా సమాధానం చెప్పాడు. 'సాహేబు' అన్న పదం వినగానే వాడి మదిలో దోఖీ ఫ్యాక్టరీ జ్ఞాపకాలు దోమల్లా ఝుమ్మంటూ లేచాయి. భూతాల్లాంటి మిషన్లు చెరకును ఆత్రంగా నమిలేస్తూ వుంటే చెరకు కుప్పలు చూస్తుండగానే మంచు దిబ్బలా కరిగి పోవడం వాడికి గుర్తొచ్చింది. కూలివాళ్ళ అరుపులు, కేకలు, ఎడ్లబండ్ల చప్పడూ, లారీల దుమ్ము ఒకటే రచ్చరచ్చగా కంగాళీగా ఆ దృశ్యం మళ్ళీ వాడికి కనిపించింది. అదంతా చూసి షేతిబా మెదట్లో జడుసుకున్నాడు. 'సాహేబు నాకు ఉద్యోగమిస్తే నేనూ ఇక్కడ ఈ యంత్రాల్లో యంత్రాన్నై పోవాలేమో, అప్పడు ఇంట్లో అందరూ నాలుగు మెతుకులు కర వొచ్చు. ఈ ఊహే ఎందుకోగానీ వాడికంతగా రుచించలేదు. ఫ్యాక్టరీ వెనుక వైపుకు వెళ్ళాడు షేతిబా. అక్కడొక లారీ నిలబడి వుంది. కొంత మంది కూలివాళ్ళు లారీలోంచి చెరకును దింపి యంత్రాలకందిస్తున్నారు. వాళ్ళ వొళ్ళంతా ఒకటే దుమ్ము కొట్టుకు పోయి వుంది. మొలాసిస్‌ను లారీలోకి ఎక్కిస్తున్నారు కూడా వాళ్ళు. దుమ్మూ, వేడి వాళ్ళని మాడ్చి పారేస్తున్నాయి. షేతిబా వాళ్ళని ఎక్కువ సేపు చూడలేకపోయాడు. ఏదో జబ్బు చేసినట్టుగా వుంది వాడికి. ముఖానికి తుండుగుడ్డని అడ్డం పెట్టుకుని అక్కణ్ణుంచి వచ్చేశాడు. ఫ్యాక్టరీ బయట ఒక బోర్డు వేలాడుతోంది. "మొలాసిస్ మోయడానికి కూలీలు కావలెను". షేతిబా దాన్ని చదివి, నవ్వుకున్నాడు. వాడెందుకలా నవ్వుకున్నాడో దేవుడికి తప్ప, కనీసం వాడిక్కూడా తెలీదు. షేతిబా ఆలోచనలు ఇగిరిపోయినట్టు ఇహలోకం లోకి వచ్చి పడ్డాడు. 'పని కాలేదని' షేతిబా చెప్పిన మాట గుడిసెలో గాలిని బరువెక్కించింది. కను బొమ్మలన్నీ ముడి వేసుకుపోయాయి. షేతిబా మెట్రిక్యులేషన్ పాసై ఇప్పటికి మూడేళ్ళు గడిచాయి. మెట్రిక్యులేషన్ పాసవడం తోటే అందరూ వాడు కుర్చీలో కూర్చుని ఫైళ్ళ మధ్య

తీవిగా వెలిగిపోయే గుమస్తా అవుతాడని కలలు గన్నారు. వాడు కూడా అంతకన్నా తక్కువేమీ ఊహించలేదు. కానీ కలలకు నిజం కావలసిన అవసరం వున్నట్టు కనిపించడం లేదు. షేతిబా ఊహల్లో క్లర్కు నుంచి స్కూలు టీచరయ్యాడు. స్కూలు టీచర్నుంచి 'తలాతి' (గ్రామ సేవకుడు)గా కూడా మారాడు. అయినా వాడు కనీసం తలాతి కూడా కాలేకపోయాడు.

ప్యూను గానైనా స్థిరపడదామని డజను దరఖాస్తులు పెట్టాడు. అయినా వాడికి ఉద్యోగం దొరకలేదు. ఉద్యోగం కోసం ఎప్పడు బయటకు వెళ్ళినా ఒక తిరస్కారాన్ని మోసుకుంటూ వాడింటికొస్తాడు. రేపటిని అంతే తిరస్కారంతో ఎదుర్కొంటాడు. నిన్నటికి నిన్న దోఖీకి కూడా అలాగే వెళ్ళాడు. ఒక వాచ్‌మన్



